ప్రజాశక్తి

బుధవారం 2 జూలై 2025

8 పేజీలు





విశాఖపట్నం   అనకాపల్లి

మృత్యు గెడ్డలు

- పలుచోట్ల రక్షణ సదుపాయాలు కరువు
- ఆదమరిస్తే అంతే సంగతులు
- నలందనగర్ గెడ్డ ప్రవాహంలో కొట్టుకుపోయి ఆటో డ్రైవర్ మృతి



నలందనగర్‌లో ఆటోడ్రైవర్ కాసులు కొట్టుకుపోయిన గెడ్డ ఇదే..

ప్రజాశక్తి. - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని గెడ్డలు భయపెడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి ఇవి పొంగి ప్రవహిస్తున్నాయి. వీటి వద్ద సరైన రక్షణ సదుపాయాలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కంచరపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న గెడ్డలో మంగళవారం ఆటో డ్రైవర్ కొట్టుకుపోయి మరణించిన సంఘటన ఈ విషయాన్నే పట్టిచూపుతోంది. ఇదే పరిస్థితి పాత నగరంలోని లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో ఉన్న గెడ్డ, డాబా గార్డెన్స్ ప్రాంతంలో ఉన్న చాకలి గెడ్డ, మల్కాపురం, గాజువాక ప్రాంతాలు సహా కొండవాలు ప్రాంతాల్లోనున్న గెడ్డల వద్దా నెలకొంది. గెడ్డల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడం, గెడ్డలకు అటూ ఇటూ రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఇటువంటి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కూడా గెడ్డల ప్రస్తావన తెచ్చి పలు హెచ్చరికలు జారీ చేశారు.

బహిర్భూమికి వెళ్లి.. మృత్యువాత పడి..

బహిర్భూమికి వెళ్లిన ఇంటి పెద్దదిక్కు గెడ్డలో కొట్టుకుపోయి మృతిచెందడంతో ఓ కుటుంబం తీవ్ర విషాదంలోకి వెళ్లింది. కంచరపాలెం నలందనగర్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జరిగిన ఆ సంఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. కంచరపాలెం పరిధిలోని నలందనగర్‌లో నివాసముంటున్న కట్ట వడ్డీ కాసులు (48) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రుక్మిణితో పాటు స్క్రాప్ వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారు జామున నలందనగర్ జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఉన్న గెడ్డ పక్కకు వడ్డీ కాసులు బహిర్భూకని వెళ్లాడు. కుండపోతగా వర్షం కురుస్తుండడంతో గెడ్డలోకి జారిపోయాడు. కేకలు వేయడంతో సమీపంలో ఉన్న భార్య రుక్మిణి అక్కడికి చేరుకుంది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న భర్తకు తన చున్నీని అందించింది. అప్పటికే వడ్డీ కాసులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి బ్రిడ్జి కింద డ్రైనేజీలో ఉండిపోయాడు. సమాచారం అందడంతో జివిఎంసి, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోయింది. డ్రైనేజీలో చిక్కుకుపోయిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ మార్చురీకి తరలించారు.



వర్షంలోనే సాగుతున్న రాకపోకలు

ఎడతెరిపి లేని వర్షం

పలు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ. : విశాఖలో సోమవారం రాత్రి నుండి కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా భీమునిపట్నంలో 36.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా అత్యల్పంగా పద్మనాభం మండలంలో 10.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహారాణిపేటలో 35.6, ఆనందపురంలో 32.2, సీతమ్మధారలో 28, ములగాడలో 23.2, పెదగంట్యాడలో 21.8, గోపాలపట్నంలో 18.6, పెందుర్తిలో 16.4, గాజువాకలో 16.4, విశాఖపట్నం రూరల్‌లో 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చావులమధుం, గాజువాక లోతట్టు ప్రాంతాల్లోకి నీరు ఎక్కువుగా చేరింది. రోజంతా ముసురు వాతావరణం అలుముకుంది. జన రాకపోకలు తక్కువుగా సాగాయి. వ్యాపారాలు చప్పగా సాగాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రణాళికలు

▸ వార్త 8లో..

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

▸ వార్త 5లో..

భూసేకరణపై రైతులను మభ్యపెట్టొద్దు

▸ వార్త 8లో..

కూటమి నిరాశపరిచింది

- రూ.430 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నా స్పందించలేదు
- జివిఎంసి కాంట్రాక్టర్ల ఆవేదన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం రావడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, తమ సమస్యలు పరిష్కారమవుతాయని, బకాయి బిల్లులు ఈ ప్రభుత్వం చెల్లిస్తుందని ఏడాదిగా ఎదురుచూశామని, తుదకు నిరాశే ఎదురైందని జివిఎంసి కాంట్రాక్టర్లు అన్నారు. జివిఎంసిలో కాంట్రాక్టర్లకు బకాయి ఉన్న రూ.430 కోట్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. మంగళవారం రాయల్ ఫోర్ట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జివిఎంసి కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పివివి.నాగరాజు, ఎం.సంజీవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు జరిగిన అన్యాయం ఈ ప్రభుత్వంలో జరగదని ఆశపడ్డామని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా తమ సమస్యలు అలానే ఉన్నాయన్నారు. సుమారు 400 మంది కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. వెంటనే బకాయి బిల్లులను చెల్లించాలని కోరారు. ఇటీవల యోగాంధ్రలో అధికారులు అప్పగించిన పనులన్నీ చేశామని తెలియజేశారు. విశాఖ నగర అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్న

మిగతా 2లో..

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులు నడిచే మార్గంలో లైట్లు, సిసి కెమెరాలు, వైద్య శిబిరాలు
- విశ్రాంతి కోసం 13 చోట్ల హాల్టింగ్ పాయింట్లు
- విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- పలుచోట్ల పర్యటించి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ, సీతమ్మధార

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ తలెత్తకుండా చూడాలన్నారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ, దేవస్థానం, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేసి దిశానిర్దేశం చేశారు.

కొండదిగువ తొలిపావంచా వద్ద పటిష్ట బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగరాదన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, 400 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. అవసరమైన అంబులెన్సులు, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. అప్పూఘర్ వద్ద భక్తులు స్నానాలు చేసే సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, సముద్ర తీరంలో బోట్లను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు చెప్పారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా 13 చోట్ల హోల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. చైల్డ్ కేరింగ్ కేంద్రాలు ఉండాలన్నారు. అనుకోని రీతిలో ఎవరికైనా అత్యవసర వైద్య సేవలుగానీ, ఇతర సేవలుగానీ అవసరమైతే ప్రత్యేక యాప్ ద్వారా సాయం అందించేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ చెప్పారు. అలాగే ట్రాఫిక్ మేనేజ్మెంట్కు సంబంధించి అస్త్రం యాప్ ద్వారా సాయం పొందవచ్చని సిపి శంఖబ్రత బాగ్చీ తెలిపారు. సిసి కెమెరాలు పెట్టాలని, లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వాలని అన్నారు. సమావేశంలో డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం ఆలయ ఇఒ త్రినాథరావు, డిఆర్ఒ భవానీ శంకర్, జివిఎంసి అదనపు కమిషనర్ రమణ మూర్తి, భీమిలి ఆర్డిఒ సంగీత్ మాథుర్, రెవెన్యూ, దేవస్థానం, జివిఎంసి, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల కలెక్టర్, జివిఎంసి కమిషనర్ పర్యటన

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మంగళవారం మధ్యాహ్నం సిపి శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్లతో కలిసి అప్పూఘర్ స్నాన ఘట్టం, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవధార, మురళీనగర్, ప్రహ్లాదపురం, కుమారి కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ పరిస్థితులను సమీక్షించారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ కూడా అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. లుంబినీ పార్క్ బీచ్ ప్రాంతం నుండి వెంకోజీ పాలెం, సీతమ్మధార, నరసింహ నగర్, మాధవధార మాధవ స్వామి దేవాలయం, నేషనల్ హైవే, ఎన్ఎస్టిఎల్, లక్ష్మీ నగర్, గోపాలపట్నం, సింహాచలం తొలి పావంచా పరిసర ప్రాంతాలు, అడవివరం జంక్షన్, ముడసర్లోవ, విశాలాక్షి నగర్, తెన్నేటి పార్క్ మీదుగా లుంబినీ పార్క్ వరకు గిరి ప్రదక్షిణ నడక మార్గాన్ని పరిశీలించారు. ముఖ్యంగా లుంబిని పార్క్ బీచ్ ప్రాంతంలో స్నానపు వసతులను, మరుగుదొడ్లను ఏర్పాటుచేసి ఆ ప్రదేశాలలో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు.

కూటమి నిరాశపరిచింది

తమకు ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాదిగా ఉన్న బిల్స్ ఇప్పుడు నిధి పోర్టల్లో నమోదు చేయడం సాధ్యం కావడం లేదన్నారు. ప్రభుత్వం తాజాగా చిన్న కాంట్రాక్టర్ల జీవనోపాధిని దెబ్బతీసేలా మొత్తం పనులన్నీ వందల కోట్ల రూపంలో ప్యాకేజీ పెట్టి బడా కాంట్రాక్టర్లకు అప్పగించాలన్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తానా ఫౌండేషన్ ట్రస్టీగా సతీష్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: అమెరికాలో స్థిరపడిన విశాఖ వాసి సతీష్ మేకాకు అమెరికాలోనూ గొప్ప గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక 'తానా'కు ఆయన ఫౌండేషన్ ట్రస్టీగా నియమితులయ్యారు. 2025 నుంచి 2029 వరకూ (నాలుగేళ్ల పాటు) ఆయన ఆ పదవిలో ఉంటారు. తానా ఎలక్షన్ కమిటీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ కలిపి సతీష్ మేకాను ఈ పదవికి ఎంపిక చేశారు. 2027లో జరగనున్న తానా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించే పాలకవర్గంలోనూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన తానా బోర్డు అఫ్ డైరెక్టర్స్తో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ సతీష్ ఓ ప్రకటనలో కతజ్ఞతలు తెలియజేశారు. 'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా నియమితులైన సతీష్ మేకా స్వస్థలం విశాఖే. పదో తరగతి వరకూ జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో చదివిన ఆయన పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. డిగ్రీ, పీజీ కూడా విశాఖలోనే చదువుకున్నారు. తాను చదువుకున్న సెయింట్ పీటర్స్ పాఠశాలకు సొంత నిధులతో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేశారు. తానా , బసవ తారకం క్యాన్సర్ ఫౌండేషన్ బృందంలోనూ సతీష్ సభ్యులుగా ఉన్నారు.

భాషా సాహిత్య సవ్యసాచి తూమాటి దోణప్ప

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శతజయంతి ఉత్సవాలు ప్రారంభ కార్యక్రమ వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుశాఖ అధ్యక్షులు మాట్లాడుతూ ఆచార్య తూమాటి దోణప్ప శతజయంతి ఉత్సవాలు ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు డిపార్ట్మెంట్లో ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా దోణప్ప ప్రియశిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం కూడా ఈ సభకు రావడంతో సభకు నిండుదనం వచ్చిందన్నారు.

ఇంద్ర బస్సు ఛార్జీల తగ్గింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం నుంచి అమరావతి, అమలాపురం ప్రాంతాలకు తిరుగుతున్న ఇంద్ర ఏసి బస్సు ఛార్జీలను తగ్గించినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఛార్జీలలో 10 శాతం మేర తగ్గించామని పేర్కొన్నారు.

స్టీల్ప్లాంట్ను సందర్శించిన రైల్వే డిఆర్ఎం



ఉక్కు అధికారులతో సమావేశమైన లలిత్ బోహ్రా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మంగళవారం ఉదయం విశాఖపట్నం స్టీల్ప్లాంట్ను సందర్శించారు. సరుకు రవాణాలో సమన్వయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగింది. మౌలిక సదుపాయాలు, సరుకు రవాణా, వ్యాపార సహకారాన్ని మెరుగు పరుచుకోవడంపై అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సమర్థవంతమైన ర్యాక్ నిర్వహణ, వ్యూహాత్మక ప్రణాళికలపై చర్చించారు. ఈ సమావేశంలో డివిజనల్ ఆపరేషన్ మేనేజర్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (సౌత్) వంటి సీనియర్ అధికారుల బృందంతో పాటు విశాఖపట్నం స్టీల్ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎకె.బాగ్చి, ఇతర సీనియర్ ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో సమన్వయం కీలకం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ :పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుదల, ప్రజాఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల్లో కేంద్ర యాజమాన్య సంస్థలు, జిల్లా యంత్రాంగంతో, జివిఎంసి కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని ఆదేశించారు.జిల్లా యంత్రాంగం, జివిఎంసి, కేంద్ర సంస్థల మధ్య సమన్వయం కొరవడకుండా ప్రత్యేక ప్రతినిధులను నియమించుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం, కేంద్ర సంస్థలు వ్యవహరించాల్సి ఉంటుందని నిర్దేశించారు. కలెక్టరేట్ సమావేశ భవనంలో మంగళవారం జివిఎంసి కమిషనర్ కేతన్గార్గ్తో కలిసి ఆయన కేంద్ర సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చెత్తా, చెదారం,ప్లాస్టిక్ డబ్బాలు కాలువల్లోకి రాకుండా ముందుగానే ఎక్కడికక్కడ మెస్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా పోర్ట్, రైల్వే, గెయిల్, ఎన్ హెచ్ఎఐ, ఐఒసిఎల్, స్టీల్ప్లాంట్, హెచ్పిసిఎల్, కోరమాండల్, గంగవరంపోర్టు పరిసరాల్లో ఉత్పన్నమవుతున్న పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించి, శాశ్వత చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. ప్రతి నెలా జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆ నాలుగు అంశాలపై దృష్టి సారించాలి : జివిఎంసి కమిషనర్

ప్రజారోగ్యం దష్ట్యా కేంద్ర సంస్థలు ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ కేతన్గార్గ్ పేర్కొన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పూడికతీతలు చేపట్టాలని పచ్చదనం పెంపుదలకు, సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర సంస్థల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యకలాపాల నిర్వహణలో జివిఎంసి నుంచి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. జివిఎంసి సిఎంవో నరేష్ కుమార్, ఇతర అధికారులు,కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయో పరిమితిని పెంచాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విఎంఆర్డిఎ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయో పరిమితిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో సమానంగా 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని మంగళవారం విఎంఆర్డిఏ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంస్థ చైర్మన్ ఎం.వి.ప్రణవ్గోపాల్ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు కూడా ఉద్యోగ విరమణ వయస్సు పెంచటం వల్ల ఎంతోమంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్పందించిన చైర్మన్ ప్రణవ్ గోపాల్ త్వరలో జరగబోయే అథారిటీ సమావేశంలో చర్చించిన తదుపరి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ఎస్విఎస్ఎన్ రాజు, కిషోర్, రవికుమార్ ఉన్నారు.

జర్నలిస్టుల వైద్య పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే వారి పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కూడా ఇవ్వనున్నామని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టు నాయకులు మంగళవారం కలెక్టర్ హరింధిర ప్రసాద్ను శాలువతో సత్కరించి వరాహలక్ష్మీ నరసింహస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ కలెక్టర్తో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించాలని, గత ఏడాది అపోలో కార్పొరేట్ ఆసుపత్రిలో నిర్వహించారని ఈ ఏడాది కూడా మంచి కార్పొరేట్ ఆసుపత్రిలో నిర్వహించాలని కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, ఇప్పటికే సంబంధిత విభాగం అధికారులకు ఆ బాధ్యత అప్పగించామని కలెక్టర్ చెప్పారు. జర్నలిస్ట్ల పిల్లలకు స్కూలుఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్ను కోరగా ఫీజు రాయితీ కల్పించడానికి తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. నేడో రేపో జిల్లా విద్యాశాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్కాస్ట్ అసోసియేషన్ కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఎస్ జగన్మోహన్, అరుణ్ కుమార్, రమణ మూర్తి, నగేష్బాబు పాల్గొన్నారు.

కమిషనర్ను కలిసిన పల్లా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జివిఎంసి నూతన కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన కేతన్గార్గ్ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా వారిరువురూ విశాఖనగర అభివృద్ధిపై, నగర ప్రజలకు కల్పించే మౌలిక వసతులపై చర్చించారు.

పాండ్రంగిలో అల్లూరి జయంతి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ నెల 4 జరుగునున్న అల్లూరి జయంతిని పురస్కరించుకొని ఏర్పాట్లు నిర్వహణపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పాండ్రంగి గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. అల్లూరి నివాసగృహం, అల్లూరి పార్కు, అల్లూరి మ్యూజియం, అల్లూరి కోనేరు పార్కును ఆయన పరిశీలించారు. దీనికి ముందు పాండ్రంగి గ్రామంలో కొంతమంది వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఉన్న మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజును ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో మండల స్థాయిలో పనులపై సమీక్షించారు. అప్పలనరసింహరాజు కొన్ని సమస్యలను గంటా దృష్టికి తీసుకొచ్చారు. పద్మనాభంలోని పద్మనాభ యుద్ధం, అనంతపద్మనాభ స్వామి కింద ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయం, పొట్నూరు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విజయ స్థూపం, పాండ్రంగి గ్రామంలో ఉన్న అల్లూరి మ్యూజియం, ఆనందపురం మండలంలో ఉన్న గుడిలోవ ప్రాంతాన్ని పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి చేయాలని అప్పలనరసింహరాజు సూచించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే పర్యాటక శాఖ అధికారులతో నిధులపై చర్చించారు. అల్లూరి జయంతిని రాష్ట్రవ్యాప్తంగా పండగలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని గంటా తెలిపారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి రూరల్ మండలాలను నగరపాలక సంస్థలో కలపడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో విశాఖ ఉత్సవం ఎలా జరుగుతుందో అదే మాదిరిగా భీమిలి ఉత్సవం కూడా ఈ సంవత్సరం ప్రారంభం కానుందని తెలిపారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా సంక్షేమ పథకాల అమలు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె.రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె.లీలావతి, కూడా డైరెక్టర్ సోమనాయుడు, టూరిజం రీజనల్ డైరెక్టర్ జగన్నాథరావు, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాకు అనువుగా ఎరువులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం, తాళ్లవలస గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి మాట్లాడుతూ, పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆవశ్యకతను రైతులకు వివరించారు. మట్టి నమూనాల ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. పచ్చి రొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో, వేరుశెనగ, వరి విత్తనాలు కిలో రూ.5 రాయితీపై పొందవచ్చని వివరించారు. వేసవి దుక్కులు అనంతరం పచ్చిరొట్ట విత్తనాలు వెయ్యడం ద్వారా మొక్కకి పోషకాలు అంది అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, ఎఒ సురేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో డిగ్రీ అడ్మిషన్లు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో మేథమెటిక్స్ - కెమిస్ట్రీ, బోటనీ - జువాలజీ, కెమిస్ట్రీ - కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ - కామర్స్, హిస్టరీ - పొలిటికల్ సైన్స్ కోర్సులు ఉన్నట్లు వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు పొందవచ్చని తెలిపారు. అడ్మిషన్ల కోసం బి.సీతన్నాయుడు 8978883125, ఎ.విజయలక్ష్మి 85229 75829 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : ఎండాడ న్యాయ కళాశాల సమీపంలోని సిఎంటి బిజినెస్ స్కూల్ ఆధ్వర్యాన మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్యా హాస్పిటల్ ప్రసూతి వైద్యులు శిల్పహాస మాట్లాడుతూ, కళాశాల నుంచి కెరీర్ వరకు, తల్లిత్వం నుండి రుతువిరతి వరకు ఒక మహిళ ప్రయాణం స్ఫూర్తిదాయకమైనదని చెప్పారు. మహిళల ఆరోగ్య అవగాహనకు పలు అంశాలను వివరించారు. జీవితంలోని వివిధ దశలలో మహిళలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను ప్రస్తావించారు. నివారణ సంరక్షణ, మానసిక ఆరోగ్యం, క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీల ప్రాముఖ్యతను వివరించారు. సమాజ శ్రేయస్సు, సమగ్ర విద్యకు అర్థవంతంగా దోహదపడే ఇటువంటి కార్యక్రమాలను సిఎంటి బిజినెస్ స్కూల్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



దిబ్బిడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-యంత్రాంగం

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో జోరు వానలోనూ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, సర్పంచ్ పి.మాణిక్యం, మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ముమ్మిన సూరిబాబు, నాగరాజు, సానపతి శ్రీనివాసరావు, మణికంఠ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో పింఛన్లను స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, దొండా సాయి, తలారి శంకర్, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండల కేంద్రంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేగోపి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, పెదపాటి కళ్యాణి, తాకాశి కృష్ణ, దాసరి బాబు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 96వ వార్డు పరిధిలోని రాజు చెరువు ప్రాంతంలో వృద్ధులు, వికలాంగులకు సామాజిక పింఛన్లను నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. పింఛన్‌దారుల ఇంటింటికీ వెళ్లి వారిని పలకరించారు. 3, 18 వార్డుల్లోని వారికి కమిషనర్ కేతన్ గార్గ్ పింఛన్లు పంపిణీ చేశారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామంలో, పద్మనాభం మండలం పాండ్రంగిలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్‌టిఆర్ ప్రారంభించిన సంక్షేమ బాటలోనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మీముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కర్రి రమణకు గంటా పరామర్శ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని వెంకటాపురం గ్రామ సర్పంచ్ కర్రి రమణ తల్లి దిన కార్యాన్ని పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని చెరకాము పరిధి ఏలేరు కాలువలో మంగళవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 60 నుండి 70 సంవత్సరాల మధ్యగా ఉంటుందని, చామనఛాయ రంగులో సుమారు 156 సెంటీమీటర్లు, ఎత్తు ఉంటుందని పోలీసులు తెలిపారు. మహిళ మృతదేహం ఎవరిదో తెలిసినవారు కశింకోట పోలీస్ స్టేషన్ సిఐ 9440796088, పోలీస్ స్టేషన్ రైటర్ 9493992223 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందిపై కఠిన చర్యలు తీసుకున్నారు. నిందితులను భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటీ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ పి స్వాతి భవాని ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3 లక్షలు జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం, ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపించడం వల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగే అవకాశం ఉన్నందున, ఇలాంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పేర్కొన్నారు.

చోరీ కేసుల్లో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన మూడు చోరీ కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి 20 తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనం, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నామని క్రైం ఎసిపి లక్ష్మణరావు తెలిపారు. పెందుర్తి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సుజాతనగర్ విరాట్ నగర్‌లో నివాసం ఉంటున్న రేయ్య జ్యోతి బంగారు వస్తువులను బెడ్ రూమ్ డ్రెస్సింగ్ కబోర్డ్ కింద పెట్టుకునేది. జ్యోతి ఇంటికి చినముషిడివాడకు చెందిన స్నేహితురాలు ఎస్.వాణి తరచుగా వచ్చి వెళ్లేది. కొన్ని నెలల తర్వాత బంగారం లేకపోవడంతో స్నేహితురాలిపై అనుమానంతో పెందుర్తి పోలీస్ స్టేషన్లో జ్యోతి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, వాణి దొంగిలించినట్లు నిర్ధారణ కావడంతో ఆమెను అరెస్టు చేసి 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాంపురం గ్రామానికి చెందిన కర్రి హేమంత్ ఇంటి వద్ద స్కూటర్ పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం స్కూటర్ కనిపించలేదు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో రూ.50 వేలు దొంగతనం చేసిన మరో వ్యక్తిని అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎసిపి తెలిపారు. నిందితులను పట్టుకోవటంలో కృషిచేసిన సిఐ శ్రీనివాసరావును, ఎస్ఐ సూరిబాబును, సిబ్బందిని ఎసిపి అభినందించారు.

జూ పార్కును సందర్శించిన రాహుల్ పాండే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అదనపు ప్రిన్సిపల్ రాహుల్ పాండే మంగళవారం సందర్శించారు. అటవీ సంరక్షణాధికారి మొహ్మద్ దివాన్ మైదీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ జూలో అభివృద్ధి పనులను, చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అనంతరం ఆయన జూ పార్కులో స్క్విరల్ మంకీ, బర్డ్స్ ఆఫ్ ప్రే, డక్ ఎవియర్ ఎన్‌క్లోజర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ పాండే మాట్లాడుతూ, సందర్శకులకు వీక్షణ అనుభవం కల్పించడానికి జంతువుల ఆవరణలను సుందరీకరణ నిర్వహణపై మరిన్ని ప్రయత్నాలు చేయాలని తెలిపారు. ప్రతి విభాగంలో అవసరమైన ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం, ముఖ్యంగా జూ ఆక్వేరియం, అడవి పిల్లుల ఎన్‌క్లోజర్, స్లోత్ బేర్ ఎన్‌క్లోజర్, రెడ్ నెక్డ్ వాలబీస్ ఎన్‌క్లోజర్లను సిఎస్ఆర్ నిధుల ద్వారా సుందరీకరణ చేయడానికి వివరణాత్మక అంచనా నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

సోలార్ విద్యుత్‌పై ప్రచారం

ప్రజాశక్తి - ఆనందపురం : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో ఆనందపురం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ ఎఇ మండల అప్పలనాయుడు తెలిపారు. ఈ పథకానికి 2024 ఫిబ్రవరి నుండి దరఖాస్తులు ప్రారంభమయ్యాయని, ఇప్పటి వరకు మండలంలో 46 మంది గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్ కనెక్షన్ పొందినట్లు పేర్కొన్నారు. వారు తమ నెలవారీ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకున్నారని వివరించారు. వెల్లంకి, ఆనందపురం, గంభీరం గ్రామాలను సోలార్ మోడల్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సోలార్ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేసినట్లు పేర్కొన్నారు.



రిలే దీక్షలో కూర్చున్న పోర్టు యూనియన్ ప్రతినిధులు

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దుచేయాలని పోర్టు యూనియన్ నాయకులు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 274వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరమూ వందల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దాంట్లో నాలుగో వంతు ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. ఈ రకంగా ఆలోచించకుండా ప్రయివేటుకు దారాదత్తం చేయాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ చేయాలని నిర్ణయం తీసుకోవడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కెఎస్.కుమార్, బి.జగన్, సిహెచ్.తిరునాథరావునాయుడు, రాజగోపాల్, కె.సత్యనారాయణ, రాఘవులు పాల్గొన్నారు.

చోడగిరి నిబద్ధతగల కవి

ప్రజాశక్తి-సీతమ్మధార : చోడగిరి చంద్రరావు గొప్ప నిబద్ధతగల మహాకవి అని, యువ కవులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ మాటూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సమత సాహితి జూలై నెల వారీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రముఖ శతకకర్త చోడగిరి చంద్రరావు సాహిత్యం మీద పరిచయ సభ నిర్వహించారు. డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా ఎస్ఆర్.వేమన, ప్రధాన వక్తగా నేలపూడి బాలరాజు హాజరయ్యారు. డాక్టర్ మాటూరి తన అధ్యక్ష ఉపన్యాసంలో చోడగిరి చంద్రరావు బలమైన అంబేద్కర్ వాద కవిత్వం రాశారని తెలిపారు. చోడగిరి రాసిన 'భీమశతకం', 'హృదయం వీణ' శతకాలను ప్రధాన వక్త నేలపూడి బాలరాజు పరిచయం చేశారు. చంద్రరావు కవి మాత్రమే కాదని, ఆయన ఒక వైతాళికుడని, ఆయన రాసిన పద్యాలు పండితులనూ, పామరులనూ మెప్పించాయని బాలరాజు చెప్పారు. చోడగిరి చంద్రరావు జీవిత విశేషాలను సభకు డాక్టర్ బండి సత్యనారాయణ పరిచయం చేశారు. నగరానికి చెందిన కవులు సియార్కే మొదలైన , సామాజిక ఉద్యమనేతలు వివి.దుర్గారావు, బీర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిసిసిఎల్‌సిఎస్ సొసైటీ కార్మికుల ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీలో హెచ్‌పిసిసిఎల్ సిఎస్ సొసైటీ కార్మికులు నలుగురు కార్మికులు ఉద్యోగ విరమణ చేశారు. వీరికి హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఆధ్వర్యాన సొసైటీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు.



ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను సత్కరిస్తున్న సిజిఎం కిరణ్ కుమార్

పరిపాలన విభాగం కేంద్రంలో హెచ్ఆర్ సిజిఎం గంట కిరణ్ కుమార్ మీదుగా చేపల బంగారయ్య, ప్రకాష్, రామారావు, అప్పారావును సన్మానించి, గ్రాట్యుటీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ సిజిఎం గంట కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, హెచ్‌పిసిఎల్‌లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేసి విరమణ పొందిన సొసైటీ కార్మికులు ఆయురారోగ్యాంగా ఉండాలని ఆకాంక్షించారు. రిటైర్మెంట్ సొమ్మును వృథా చేయకుండా, అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్, సీనియర్ మేనేజర్ దుర్గాప్రసాద్, దివాకర్, సొసైటీ అధ్యక్షులు ఎన్‌వి.రమణ, సహాయ అధ్యక్షులు బి.చిన్నారావు, కార్యదర్శి ఎస్.పైడిరాజు, కోశాధికారి వై.భాస్కరరావు, డైరెక్టర్లు చెల్లిబోయిన శ్రీనివాసరావు, కార్మికులు ఉమామహేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకే సంపద

ప్రజాశక్తి-వేపగుంట : నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకు నష్టం చేసే విధానాలను అవలంబిస్తూ, సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ విమర్శించారు. సిఐటియు గోపాలపట్నం జోన్ 11వ మహాసభ మంగళవారం కృష్ణాద్రి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మిక చట్టాలను మార్చి కార్మికులకు నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇవి అమలు జరిగితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకొనే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే హక్కులు కోల్పోతారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, తొలగించిన 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంకులు, పోర్టులు, విమానాశ్రయాలు, చమురు సంస్థలు, రక్షణరంగం, అంతరిక్షం, గనులు తదితరాలను ప్రయివేటీకరణ చేయరాదని, అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగు, తోపుడు బండ్లు, మోటార్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, స్కూల్ శానిటేషన్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, ఈపిఎస్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9000 చెల్లించాలని, ఇంటి పనివారిని కార్మికులుగా గుర్తించి సమగ్ర చట్టం చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 9వ తేదీన చేపట్టే సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో, ఇతర మోటార్ కార్మికులు వాహనాల నిలుపుదల చేసి బంద్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కార్యదర్శి బి.జగన్ మాట్లాడారు. అనంతరం జోన్ కమిటీని ఎన్నుకున్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్

నూతన కమిటీ

మహాసభ సందర్భంగా సిఐటియు గోపాలపట్నం జోన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.అనసూయ, జి.శంకర్రావు, ఎంవి.ప్రసాదరావు, వి.రాజు, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటరావు, కార్యదర్శులుగా పివిఎస్ఎన్.రాజు, ఎస్.పద్మ, ఆల్.మల్లేష్, బృందా, కె.అప్పలనాయుడు, కోశాధికారిగా శంకర్రావుతో పాటు 24 మందితో కమిటీని ఎన్నుకున్నారు

ఘనంగా స్వాతి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న స్వాతి ప్రమోటర్స్ సిబ్బంది

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వాతి ప్రమోటర్స్ సంస్థ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లోని సంస్థ కార్యాలయంలో స్వాతి ప్రమోటర్స్ 19వ వార్షికోత్సవ వేడుకలు, మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సంస్థ ఎదుగుదలలో సిబ్బంది చొరవ, ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. అనంతరం పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎమ్‌డి మేడపాటి సురేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార కార్యాలయంలో...

స్వాతి ప్రమోటర్ 19వ వార్షికోత్సవం వేడుకలు, చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను సీతమ్మధారలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తన జన్మదిన వేడుకలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతి ప్రమోటర్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ, సంస్థ ఎదుగుదల్లో ముఖ్యపాత్ర వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎమ్‌డి మేడపాటి రమేష్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మధార కార్యాలయంలోని వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కృష్ణారెడ్డి

సామాజిక బాధ్యతలో వైద్యులు

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : సామాజిక బాధ్యతలో వైద్యులు ప్రముఖులై ఉంటారని డాక్టర్ జగన్మోహన్ అన్నారు. స్థానిక గాంధీ నగరం చర్మవ్యాధుల ఆసుపత్రిలో మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా భగవతుల చాతాడ శ్రీశ్రీ వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ జగన్మోహన్, డాక్టర్ జైదీప్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తిరుపతి శేఖరు, కార్యదర్శి నీలాచలం వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మెడికవర్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు.

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హరిలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, యజ్ఞశ్రీ, శ్రీను పాల్గొన్నారు.

సీతమ్మధార : శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాంతీయ నేత్ర వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ, భారతరత్న డాక్టర్ బిసి.రాయ్ జన్మదినాన్ని డాక్టర్స్ డే అని జరుపుకుంటున్నామని తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ, రోగులకు ప్రేమతో వైద్యం అందించాలన్నారు. కెజిహెచ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, రోగికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందిస్తే ప్రాణహాని నుంచి తప్పించవచ్చన్నారు. ప్రభుత్వ గోషా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రధాన వైద్య సంచాలకులు డాక్టర్ వేప మీనాక్షి తదితరులు ప్రసంగించారు. అనంతరం వైద్యులు సంధ్యాదేవి, ఐ.వాణి, ఉషా ప్రసాద్, వేప మీనాక్షి తదితరులను రూపాకుల రవికుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్ జ్యోతిర్మయి, ఆర్ఎంఒ డాక్టర్ నవీన్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఎవి.రమణ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జగన్మోహన్, డాక్టర్ జైదీప్‌లను సత్కరిస్తున్న వైష్ణవ సేవా సంఘం సభ్యులు

శ్రీనువాడే జూనియర్ కాలేజీలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో పిల్లలకు హోమియోపతి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బీసెట్టి రాము, డాక్టర్లు అశ్విని వర్మ, డాక్టర్ అనిత, కళాశాల డీన్ మురళీ ప్రసాద్, విశ్వ కీర్తి, ప్రిన్సిపల్ ఉదయ్, అభి, పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

భవన నిర్మాణ కార్మికులతో సమావేశమైన సిఐటియు జిల్లా అధ్యక్షులు లోకనాథం



భవన నిర్మాణ కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న లోకనాథం

ప్రజాశక్తి-రాంబిల్లి

కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరుగు దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మండలంలోని భవన నిర్మాణ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం, మాట్లాడుతూ భవన నిర్మాణాలను నుండి వసూలు చేస్తున్న సెస్ డబ్బులు ప్రతి ఒక్క రూపాయి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైములు చెల్లించాలని, వీరి అభివృద్ధికి సంక్షేమ చట్టం తేవాలని కోరారు. పెంచిన పని గంటలు నిర్ణయాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, నాయకులు చందక రామకృష్ణ, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు శిరం రాంబాబు, భవన నిర్మాణ, కొబ్బరి దింపుడు, కొబ్బరి ఒలుపు కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటేశ్వరరావు

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

పరవాడ : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తక్షణమే అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరుగు సార్వత్రిక సమ్మె కరపత్రాలను మంగళవారం లంకెలపాలెంలో ముఠా కార్మికులతో కలిసి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ముఠా కార్మిక సమగ్ర చట్టం చేయాలని, పని భద్రత కల్పించాలని, రూ.10 లక్షల బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు దాసరి దేవుడు, కే వెంకట్రావు, శ్రీను, తాతబాబు పాల్గొన్నారు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు



రావికమతంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఠా కార్మికులు

రావికమతం: ముఠా కార్మికులకు సమగ్రమైన చట్టాన్ని అమలు చేయాలని రావికమతం మండల సిఐటియు కార్యదర్శి వజ్రపు సత్యవతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ముఠా కార్మికులతో ప్రత్యేక సమావేశంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో ముఠా కార్మికులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ముఠా సంఘం ప్రెసిడెంట్ కరణం రమణ బాబు, పలువురు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ములగాడ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన 61వ వార్డు పరిధి వెంకన్నపాలెంలోని సిఐటియు ఆఫీసులో ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కె.అనిల్‌కుమార్, సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు నష్టం కలిగించే విధానాలు తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని తదితర డిమాండ్లతో చేపట్టే సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, ఎ.సత్యారావు, ఐఎన్‌టియుసి నాయకులు తాతబాబు, ఎఐటియుసి నాయకులు జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను మండలంలోని హరిపాలెం, అచ్యుతాపురం గ్రామాలలో మంగళవారం సిఐటియు ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీమణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు రాజన్న, అప్పలనాయుడు, వెలగా అచ్చం నాయుడు, కాంట్రేగుల రాము, కర్రి జగ్గారావు, సూర్యనారాయణ, అప్పలసూరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు



పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాలికల హైస్కూల్‌లో 110 మంది విద్యార్థుల చేరిక

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 110 మంది విద్యార్థినులు ప్రవేశం పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్.స్వర్ణ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ బాగచదువు కొని స్కూల్‌కు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. అనంతరం నూతన విద్యార్థులకు ఉపాధ్యాయులు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎ.రవి, పీడీ కాళీదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఐతో సాంకేతిక సమగ్రత

ప్రజాశక్తి-అనకాపల్లి : డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో సాంకేతిక సమగ్రత, ఎఫ్‌డిపి కృత్రిమ మేదస్సుతో ఆకర్షణీయమైన వేతనాలు పొందవచ్చని టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ నాగార్జున మల్లాది అన్నారు. దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎఫ్‌డిపిలో భాగంగా మంగళవారం ప్రోజెసివ్ డిజైన్ థింకింగ్ అప్రోచ్‌తో ఇన్నోవేటర్స్‌పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మల్లాది డిజైన్ ట్రాన్స్మిషన్ ట్రెండ్స్ అప్లయింగ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ డిజైన్ థింకింగ్ గురించి అధ్యాపకులకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, జనరేటివ్ ఇప్పుడు ఐటీలోని ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని, అవి ఇప్పుడు లక్షలు జీతాలతో కూడిన ఉద్యోగాలు అందుకునే స్థితి కల్పించబడుతుందని పేర్కొన్నారు. స్ట్రాటజీ ఆఫీసర్ చంద్ర దాసక డిజైన్ థింకింగ్ పద్ధతులను పరిచయం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకడమిక్, వైస్ ప్రిన్సిపల్, వివిధ విభాగాధిపతులు, సిఎస్ఈ ఫ్యాకల్టీ, స్టూడెంట్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

టిడిపి విస్తృత స్థాయి సమావేశం

అచ్యుతాపురం : టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అచ్యుతాపురంలో మంగళవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, పార్టీ నియోజకవర్గ పరిశీలనకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు పీలా తులసి రాము, లాలం భరత్, పెంటకోట విజయ్, గొర్లె నానాజీ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, యిత్తంశెట్టి సన్యాసినాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో పురుగులు, బొద్దింకల భోజనాలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనకాపల్లి : హోం మంత్రి వంగలపూడి అనిత సంక్షేమ హాస్టల్లో చేసిన భోజనంలోనే పురుగుల, బొద్దింకలు ఉన్నా నేటి వరకు చర్యలు తీసుకోలేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ సంఘం ఆధ్వర్యాన అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సంక్షేమ హాస్టళ్ల భోజనం పరిస్థితి ఏ మాత్రం బాగోలేదన్నారు. స్వయంగా హోం మంత్రి ఒక సంక్షేమ హాస్టల్ సందర్శనలో భోజనం చేస్తుండగా బొద్దింక ఆమె భోజనం ప్లేట్లో ఉండడం జరిగిందని, ఇలాంటి రోజులు విద్యార్థులు ఎన్నో గడిపారని పేర్కొన్నారు. మౌలిక వసతులు, సొంత భవనాలు లేని హాస్టల్ విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వీటిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అన్ని సంక్షేమ, గురుకుల, కెజిబివి, కళాశాల సంక్షేమ హాస్టల్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ ఆత్మీయ సత్కారం



విఆర్ఒల సంఘం అధ్యక్షులు త్రినాథ రామకాసును సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం సోమవారం రాత్రి జరిగింది. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా వైసీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, వైసిపి అనకాపల్లి పార్లమెంటు ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌డి.అనిత, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖపట్నం రెవెన్యూ డివిజన్ వీఆర్వోల సంఘం నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైసిపి నేతలు త్రినాథ రామకాసు దంపతులను ఘనంగా సత్కరించారు. వారంతా రామకాసు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ త్రినాథ రామకాసు వీఆర్వోల సంఘం మండల, జిల్లా అధ్యక్షులుగా పలు సేవలు అందించారని, విఆర్ఒల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి పరిష్కరించారని తెలిపారు. ఉత్తమ విఆర్ఓగా పలుమార్లు అవార్డులను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసీపీ సీనియర్ నేతలు బైలపూడి భగవాన్ జయరాం, కోటాన రాము, పైల శ్రీనివాసరావు, శరగడం చిన అప్పలనాయుడు, సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, వనం అచ్చంనాయుడు, కర్రి బాబు, సర్పంచులు వడ్డాది అప్పలరాజు, బలిరెడ్డి కనకరాజు, బోను నాయుడు, బండారు శ్రీను, వీఆర్వోలు, అభిమానులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఉద్యోగ విరమణ పొందిన అనకాపల్లి మండలం చింతనిప్పుల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లేటి జగదీశ్వరరావు, తులసిలక్ష్మి దంపతులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అలాగే ఇటీవల ఈ పాఠశాల నుంచి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ప్రసాదరావు, విజయ ఆనంద్, గణేష్‌లను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గండేపల్లి రాము, సిఆర్పి దేవి, ఉపాధ్యాయులు శివరామకృష్ణ, సురేష్, వేలంగిని, కేయం నాయుడు, శ్రీనివాస పాత్రుడు, లక్ష్మీ కృష్ణంరాజు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పట్టణం వేల్పులవీధి శ్రీసీతారామ కళ్యాణ మండపంలో కీర్తిశేషులు బొద్దపు మాణిక్యం 85వ జయంతి కార్యక్రమం సందర్భంగా బిఎం చారిటబుల్ సంస్థ, టిడిపి 83వ డివిజన్ ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, విశాఖ జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బొద్దపు మాణిక్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, పోలారపు త్రినాథ్, కర్రి బాబి, కొరిబిల్లి పత్రి, పొలిమేర ఆనంద్, గొర్లి శేఖర్, వాకాడ కోటి, బద్రి, పైలా గోపి, గొల్లవెల్లి నూకరాజు, కూటమి పార్టీ నాయకులు, బొద్దపు మాణిక్యం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

'సుపరిపాలనకు తొలి అడుగు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది పూర్తయిన తరుణంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' పేరుతో చేపట్టే కార్యక్రమాలను జయప్రదం చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రైవాడ జలాశయ అతిథి గృహ ప్రాంగణంలో బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్చార్జిలు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల పార్టీ ముఖ్య నేతలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ జులై 2వ నుండి ప్రజల్లోకి వెళ్లి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు వై.ఏసుదాసు, కూటమి నాయకులు దొగ్గ దేముడు నాయుడు, పోతల పాత్రు నాయుడు, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, కొమర బాబురావు, బండారు రామారావు, చల్లా నానాజీ, సోమిరెడ్డి గోవింద, ఆదిరెడ్డి వరలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'వివిఎస్ఆర్'కు బెస్ట్ ట్రస్టు అవార్డు



అవార్డు చూపుతున్న సత్యారావు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, పొట్టి దొరపాలెం కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌కు బెస్ట్ ట్రస్ట్ అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆసియా వేదిక్ అంతర్జాతీయ సంస్కృతి, పరిశోధన స్ఫూర్తి అకాడమీ వారు సంస్థ కార్యదర్శి వడ్డి సత్యారావుకు బెస్ట్ ట్రస్ట్ అవార్డు బహూకరించారు. సత్యారావు ఆర్ఎంపీ డాక్టర్‌గా పని చేస్తూనే వివిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సత్యారావు సేవలను గుర్తించి ఈ అవార్డు బహూకరించారు. గతంలో స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మదర్ థెరిస్సా అవార్డు, సత్యారావుకి డాక్టరేట్ లభించాయి.

'కూటమి నేతలతో వడ్దాది ప్రతిష్టకు భంగం'

ప్రజాశక్తి-వడ్డాది : ఉమ్మడి విశాఖ జిల్లాలో వడ్డాదికి మంచి గుర్తింపు ఉందని, టిడిపి కూటమి నాయకుల తమ ఆధిపత్య పోరు వల్ల గ్రామ ప్రతిష్టకు భంగం కలుగుతుందని వైసీపీ నాయకులు విమర్శించారు. కూటమి నాయకుల వేధింపుల కారణంగా ఇటీవల కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఆసుపత్రిపాలైన నేపథ్యంలో వైసీపీ నేతలు మంగళవారం వడ్డాదిలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైసిపి టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవిల జనార్ధనరావు, ఎంపీటీసీ కోరుకొండ రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులపై బెదిరింపులు పెరిగిపోయాయని, వారి వేధింపుల కారణంగా వడ్డాదిలో ఉద్యోగులు భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఇలాంటి సంస్కృతి ఈ ప్రాంతంలో లేదన్నారు. ప్రజలను, అధికారులను బెదిరిస్తే వైసిపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎం స్కూల్ ఛైర్మన్ అప్పారావు, చింతల శంకర్రావు, అయ్యన్న దొర, తెప్పల నాగేష్, మురళి, రమేష్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

డెంగీ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ డెంగీ మాసోత్సవం-2025 పోస్టర్, కరపత్రాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జులై 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు డెంగ్యూ నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి నిల్వల వద్ద చెత్త తొలగించడం, దోమల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవడం వంటి అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీని ఆదేశించారు. డెంగీ నివారణ కార్యక్రమాల నిర్వాహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా మలేరియా అధికారి కెవి దొరని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ కృష్ణారావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జ్యోతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంతి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

కశింకోట : జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎస్.సుమ, డాక్టర్ బి.మంజూష ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ, సదస్సు మంగళవారం నిర్వహించారు. పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అంటూ నినాదం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు ఎంఎస్‌వి.ప్రసాద్, ఆరోగ్య సహాయకులు పి.శివరామకృష్ణ, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

విశాఖలో ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ జ్వరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పగటిపూట కుట్టే దోమల ద్వారా డెంగీ జ్వరం వ్యాపిస్తుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా కెవిఎస్.ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి తెలిపారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జివిఎంసి బయాలజిస్ట్ సాంబమూర్తి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

625 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత



బాధితులకు ఫోన్లు అందించిన ఎస్పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 10వ విడత మొబైల్ రికవరీ మేళా మంగళవారం నిర్వహించారు. ఇందులో సుమారు రూ.1.20 కోట్ల విలువైన ఆపిల్, శాంసంగ్, వివో, రెడ్‌మీ తదితర కంపెనీలకు చెందిన 625 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ తుహిన్ సిన్హా చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 5,600 ఫిర్యాదులు నమోదుకాగా, 10వ విడతతో కలిపి మొత్తం 3,336 మొబైల్ ఫోన్లను (రూ.5.27 కోట్ల విలువైన) బాధితులకు అందించినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుండి సైతం ఫోన్లను రికవరీ చేయడం జరిగిందన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే మొబైల్ వివరాలను తెలియజేసి రికవరీ చేసే విధానాన్ని అమలు చేసి ప్రజలకు సౌలభ్యం కల్పించామన్నారు. https://www.ceir.gov.in లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9346912007కు హాయ్ అని పంపి వచ్చే లింకు ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. మొబైల్ రికవరీలో కృషి చేసిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు, ఐటి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, ఐటి కోర్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, సైబర్ సెల్ అండ్ సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు, ఇతర ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మణమూర్తి, లక్ష్మి, రమేష్, గఫూర్, ఐటి కోర్ ఎస్సై బి.సురేష్‌బాబు, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి-కె.కోటపాడు : రైతులు వరి నారు మడులు వేసుకునే ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని, తద్వారా వరికి తెగుళ్ల సోకకుండా అరికట్టవచ్చని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని వారాడ, సంతపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తన శుద్ధి బీజామృతంతో చేసుకోవాలన్నారు. ఇప్పటికే వరి విత్తనాలు 1230 క్వింటాలు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో రైతులు గోరుపోటు వెంకటరావు, లెక్కల అవతారమ్మూర్తి, లెక్కల నారాయణ మూర్తి, లెక్కల దేవిలత, సింగంపల్లి వెంకటరమణ, లెక్కల దేముడునాయుడు, సంతపాలెం సెక్రటరీ కొండబాబు, ప్రకృతి వ్యవసాయ అధికారులు పాత్రుని నాయుడు, లెక్కల భాస్కర్ పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి మండలం పంచదార్ల, దిమిలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుమంత మాట్లాడుతూ రాగి, సజ్జలు, జొన్నలు, కొర్ర వంటి చిరుధాన్యాల పంటలు సాగు చేయడానికి రైతులందరు ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టరు శిరీష, వివఎలు సరోజిని, మేఘన, రైతులు పాల్గొన్నారు.

దాబాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-కశింకోట : జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కశింకోట సిఐ ఎ.స్వామినాయుడు ఆధ్వర్యంలో కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దాబాల్లో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. దాబాల్లో అక్రమంగా మద్యం అమ్మకం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా మద్యం అమ్మకాలు చేసినా, దాబాల్లోకి లిక్కర్లు అనుమతించినా కఠిన చర్యలు తీసుకుంటామని దాబా యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోజ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కూటమి ప్రభుత్వంలో 80 శాతం రాయితీతో రైతులకు మంజూరు చేస్తున్న ఆధునిక వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పవరం గ్రామంలో మంగళవారం ఆయన వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన డ్రోన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పి.వాసు, చిన్ని శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైయినేజీ

దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న ఎస్‌సి కాలనీ వాసులు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని చింతలపాలెం సచివాలయం ఎదురుగా ఎస్‌సి కాలనీకి వెళ్లే రహదారి వద్ద ఉన్న డ్రైయినేజీ ప్లాస్టిక్ వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయింది. దీంతో మురుగు నీరు ప్రవహించడానికి వీల్లేక నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ జాతీయ రహదారి పక్కన ఉండడంతో ఎగువ కాలనీ వాసులు వాడిన నీరు ఈ డ్రైనేజీలోకి రావడం, ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయి మురుగు నీరు ప్రవహించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అయినా కూడా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మూడు రోజులుగా చెదురు మదురు జల్లులు కురుస్తుండడంతో డ్రైయినేజీ నుండి దుర్వాసన మరింత పెరిగింది. డ్రైయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ఘనంగా బంగారమ్మతల్లి పండగ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామ దేవత బంగారమ్మతల్లి అమ్మవారి పండగ అనుపు మహోత్సవం సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షులు, ఆలయ కమిటీ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు నీలవేణి దంపతులు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేవుడమ్మ, సర్పంచ్‌లు దెడ్డం ప్రసాద్, బలిరెడ్డి కనకరాజు, ఉప సర్పంచ్‌లు కరణం సురేష్, సిరపరపు వాసు, వైసిపి నాయకులు దువ్వి దుర్గాలు, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఎఐఐఇఎ వజ్రోత్సవం


నర్సీపట్నంలో వ్యవస్థాపక దినోత్సవంలో బీమా ఉద్యోగులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) 75వ స్థాపన దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో జరుపుకున్నారు. ఎల్ఐసి ఐసిఇయు ప్రెసిడెంట్ కె.కేశభద్రం పడాల్, సెక్రటరీ సాయిరాం ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు రంగులతో రంగవల్లులు తీర్చిదిద్దారు.

ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ ఎఐఐఇఎ 75వ సంవత్సరంలోకి గర్వంగా అడుగుపెడుతోందని, సాధారణంగా సంస్థ ఉద్యోగులు ఒక సంఘం గా ఏర్పడడం అరుదు కానీ, అనేక ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా ఎఐఐఇఎ అనే సంఘంగా ఏర్పడి ప్రైవేటు సంస్థలన్నింటినీ ఒకటిగా కలిపి జాతీయీకరణ చేయాలని అనేక విధాలుగా పోరాటం చేసి 1956లో భారతీయ జీవిత బీమా సంస్థ ఆవిర్భవించడానికి ఎంతో కృషి చేసిన సంఘం ఇది అని కొనియాడారు.

1951 జూలై 1న భారత కార్మిక ఉద్యమ చరిత్రలో అపురూపమైన స్థానాన్ని సంపాదించిందని, ఇది బీమా ఉద్యోగుల హక్కులకోసం పోరాటానికి నాంది పలికిన సంఘటిత శక్తి మాత్రమే కాదు, భారత సమాజం కోసం ఒక నైతిక ప్రమాణంగా కూడా ఎదిగిందని కోరారు. బీమా రంగంలో ప్రాథమిక హక్కులైన జీవన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, సెలవులు, సిక్ లీవ్ వంటి హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేసిన సంఘం ఎఐఐఇఎ మాత్రమేనన్నారు. ఉద్యోగులకు పెన్షన్ హక్కు సాధింపజేసిన చారిత్రక విజయాన్ని అందించిందని గర్వంగా తెలిపారు. అంతేకాకుండా ఎల్ఐసీ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిరోధించేందుకు దేశవ్యాప్త ఉద్యమాలు నడిపి వాటిని ప్రజల సొత్తుగా కాపాడిందన్నారు.

చోడవరం : ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) 75వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో సంఘం జెండాను బిఎస్ యూనిట్ అధ్యక్షులు అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కళ్యాణ్ మాట్లాడుతూ ఎల్ఐసి పుట్టకముందే ఎఐఐఇఎ ఆవిర్భవించిందని, ప్రైవేటు బీమా రంగ సంస్థలను జాతీయం చేస్తూ ప్రజల సొమ్ముని ప్రజల కొరకే అని నినాదం చేసిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఐక్య పోరాటాల ద్వారా సంఘాన్ని, ఎల్ఐసి సంస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



చోడవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

రిటైర్డ్ ఎంఇఒ జోష్‌కు ఘన సత్కారం


రిటైరైన జోష్‌ను సత్కరిస్తున్న హోంమంత్రి, డిఇఒ

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల విద్యాశాఖ అధికారి జోష్ ఉద్యోగ విరమణ వేడుక మంగళవారం కె.బి చర్చి వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ చాలా విలువైనదని, ఎంఇఒగా జోష్ సమర్ధవంతంగా పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, ఎ.ఎం.శ్రీనివాస రావు, లాలం కాశీనాయుడు, లింగన్న నాయుడు, ఎంఇఒ రామారావు , పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలో ఆయన స్వగృహంలో జన్మదిన వేడుకల్లో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన హోంమంత్రి అనిత, ఆయనకు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హోంమంత్రి అనిత, వెంకటేష్‌లను పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు .పాయకరావుపేట నియోజకవర్గం లో పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ,అధికారులు తరలివచ్చి వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో వెంకటేష్ ఇంటి వద్ద సందడి నెలకొంది.

ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా బాలదొర


బాలదొర


ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం మండలం ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా బాల దొర మంగళవారం బాధ్యతలు చేపట్టారు, ఇక్కడ పనిచేసిన ఇఒపిఆర్‌డి సీతామహాలక్ష్మి చింతపల్లి బదిలీపై వెళ్లారు, బాల దొర ప్రస్తుతం మాకవరపాలెం గ్రామంతో పాటు తామరం గ్రామానికి కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

మండల సర్వేయర్‌గా చిన్నబాబు


చిన్నబాబు

ప్రజాశక్తి- కోటవురట్ల : మండల సర్వేయర్‌గా ఎ.చిన్నబాబు మంగళవారం ఉద్యోగబాధ్యతలు తీసుకున్నారు. ఎలమంచిలి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు, ఈ సందర్భంగా చిన్నబాబుకు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఆహ్వానం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

దొంగతనాలపై అప్రమత్తత


పోలీసులు విడుదల చేసిన దొంగ ఫొటో

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో పగటి పూట, తాళాలు వేసిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇళ్లలో చొరబడి దొంగతనాలు చేస్తున్న ఒక వ్యక్తి సంచరిస్తున్నాడని, అతనిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ నర్సీపట్నం పట్టణ, రూరల్ పోలీసులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం చోరీకి పాల్పడుతున్న వ్యక్తి ఫోటోను మీడియాకు విడుదల చేశారు. ఫోటోలో ఉన్న వ్యక్తి గురించి తెలిసిన, చూసినా, ఆచూకీ తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. సమాచారాన్ని వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 112కు గానీ, లేకుంటే డిఎస్‌పి (9440796070), పట్టణ సిఐ (9490760572), రూరల్ సిఐ (9490619497) నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో డిఎల్ పురం ప్రాంతంలో స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ కేటాయించిన భూములను సంబంధించిన ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ ఏర్పాటుకు డిఎల్ పురం ప్రాంతంలో ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ మేరకు తహసిల్దార్ నరసింహ మూర్తి, ఎపిఐఐసి అధికారులు వారికి కేటాయించిన భూములను చూపించారు. భూములు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..!

అవస్థలు పడుతున్న ప్రజలు


రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలో పెద తీనార్ల గ్రామం మీదుగా దొండవాక, రాజయ్యపేట వెళ్లే మార్గం గుంతలు ఏర్పడి, వర్షపు నీరు ఏరులై పారుతోందని పట్టించుకునే నాధుడే కరువయ్యారని మత్స్యకార నాయకులు నూకనాథం,మైలపల్లి అమ్మోరియ్య, మైలపల్లి శాంతి ప్రసాద్, పిక్కి కోదండరావు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షం వచ్చినప్పుడు వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని, నెలలు తరబడి గుంతల్లో నీరు నిల్వ ఉండిపోతుందన్నారు. రోడ్డు సక్రమంగా లేనందున అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తారు. వెంటనే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

అంతర పంటల సాగుపై రైతుల ఆసక్తి


పాత మల్లంపేట జీడి తోటలో అంతర పంట నువ్వు

ప్రజాశక్తి -గొలుగొండ : అంతర పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో జీడీ మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు అంతర పంటల విధానంలో అపరాలు, కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. అంతర పంటలను ప్రధానంగా మొక్కదశలో న్న జీడీ మామిడి తోటలు గల మధ్య గల ఖాళీలో వేస్తున్నారు. మండలంలో పాత మల్లంపేట పప్పిశెట్టిపాలెం చోద్యం, లింగంపేట కొత్త ఎల్లవరం తదితర గ్రామాల్లో ప్రస్తుతం మామిడిలో అంతర పంటగా నువ్వులు, మినుములు, కంది, బొబ్బర వంటి అపరాల సాగుతో పాటు, వంగ, కూరబొబ్బర్ల కూరగాయలు పంటలను సాగు చేస్తున్నారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చునని సాగు రైతులు అంటున్నారు. అంతరపంటగా సాగులో ఉన్న నువ్వు పంట కోతదశకు చేరుకుంది.

పారిశుధ్య పనుల పరిశీలన


శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- నక్కపల్లి : నక్కపల్లిలోశానిటేషన్ పనులను మంగళవారం ఎంపిడిఒ డి సీతారామరాజు పరిశీలించారు. ఇంటింటా తడి పొడి చెత్త సేకరణపై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. తడి పొడి చెత్త సేకరణపై ఇంటింటా అవగాహన కల్పించి, సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ముమ్మరంగా శానిటేషన్ పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు..

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి -కోటవురట్ల : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని సూచించారు. విద్యార్థులకు క్రీడల పట్ల మక్కువ చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం సుకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ


నోటు పుస్తకాలను అందిస్తున్న వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతి పథకంలో భాగంగా శివపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కాపీరైటింగ్స్ ,అక్షరమాల క్యాలెండర్ చార్టులను పిఆర్‌టియు నాయకులు డీజీ నాథ్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దేవత అరుణ, జెడ్‌సి పద్మనాభుని రాజి, ప్రెసిడెంట్ గ్రంధి రాధాశ్రీ, సెక్రెటరీ కేదార్‌శెట్టి విజయలక్ష్మి, ట్రెజరర్ దాసరి దేవి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి జయంతి ఏర్పాట్ల పరిశీలన

అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో ఈ నెల 4న జరిగే అల్లూరి జయంతి ఏర్పాట్లను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, వేడుకల్లో నిర్వహించబోయే అనేక కార్యక్రమాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అల్లూరి 128వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించనుందన్నారు. ఈ వేడుకలను అల్లూరి అభిమానులు, గ్రామ ప్రజలు, పెద్దలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలసి వేడుకగా నిర్వహించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొనాలని సూచించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును అల్లూరి జయంతికి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ పార్కు అభివృద్ధికి అడగకుండా రూ. పది లక్షల ఎంపి కోటా నిధులు కేటాయించిన ఎంపీ కలిశెట్టికి స్పీకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొననున్నట్లు తెలిపారు. కలెక్టర్, ఎస్పీతో పాటు అన్ని శాఖలకు చెందిన అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. సమీక్షా సమావేశంలో అయ్యన్న తనయుడు కౌన్సిలర్ చింతకాయల రాజేష్, ఆర్‌డిఒ వి.వి.రమణ, ఇన్‌ఛార్జి టూరిజం జిల్లా అధికారి కే.మనోరమ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల నానిబాబు, మాజీ జెడ్‌పిటిసి వేణు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమల పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విశాఖ హాస్పిటల్

జివిఎంసి 86, 87 వార్డుల వాసులకు సేవలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వైఎల్.నర్సింగరావు, చిత్రంలో సంతోష్ కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - గాజువాక : ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో విశాఖ హాస్పిటల్ (కూర్మన్నపాలెం) సౌజన్యంతో డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఆటోనగర్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో మంగళవారం తలపెట్టిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 86, 87 వార్డుల పరిధిలోని ఫకీర్ తక్యా, యాదవ జగ్గరాజుపేట, వడ్లపూడి, కాళింగ వీధి ప్రాంతాలకు చెందిన ప్రజలు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. విశాఖ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పివివి.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిష్ణాతులైన వైద్యులు ఈ శిబిరంలో సేవలందించారు. డాక్టర్లు జి.సుజిత్, గీత, నవీద్ ఖాన్, బి.లావణ్య, హేమంత్, సుజిత్ ఆనంద్ రోగులను ఆత్మీయంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను తెలిపారు.

వైద్య శిబిరాన్ని కెజిహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎల్.నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రజాశక్తి నిరంతరం ప్రజల పక్షాల నిలబడుతుందని అన్నారు. భారతరత్న బిసి.రాయ్ జయంతి, వర్ధంతి, ప్రజాశక్తి సాహితీ సంస్థ మొట్టమొదటి చైర్మన్ కొరటాల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. బ్రిటన్, అమెరికాల్లోని వైద్యం తీరుతెన్నులను వివరించారు. పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందాల్సిన అవసరముందన్నారు. విశాఖ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పివివి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమంలో తాము కూడా పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కూర్మన్నపాలెంలోని దువ్వాడ స్టేషన్ రోడ్డులో ఉన్న తమ 30 పడకల ఆసుపత్రిలో 24 గంటలా ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. డాక్టర్ గీత మాట్లాడుతూ నేడు చాలా మంది జబ్బు వచ్చినా హాస్పిటల్‌కు వెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, అలా చేయరాదని అన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రజాశక్తి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక సంచికలు తీసుకురావడంలో ప్రజాశక్తికి మంచి పేరుందని, దాన్ని నిలబెట్టుకుంటూ డాక్టర్స్‌డేను పురస్కరించుకుని వైద్యుల అభిప్రాయాలు, సూచనలతో స్పెషల్‌ను తాజాగా తీసుకొచ్చిందని అన్నారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యాన జరుగుతున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు.

ప్రారంభ సభకు ముందు బిసి.రాయ్, కొరటాల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లందరినీ ప్రజాశక్తి తరుపున సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. అలాగే మలబార్ గోల్డ్ గాజువాక బ్రాంచి మేనేజర్ ఆనంద్ వైద్యులకు చిరుకానుకలను అందించి సత్కరించారు. ప్రజాశక్తి బ్యూరో చీఫ్ ఎం.మధుసూదనరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం సాగింది. జి.సంతోష్ కుమార్ వందన సమర్పించారు.



ప్రజాశక్తి డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు



వృద్ధునికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



వైద్యశిబిరంలో రోగులకు సేవలు అందిస్తున్న విశాఖ ఆసుపత్రి సిబ్బంది

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రణాళికలు

● రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అనిత

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో నిరుద్యోగ సమస్యలను పరిష్కారానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు మంగళవారం బికెపల్లి గ్రామంలో పర్యటించి సామాజిక పింఛన్ల పంపిణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారుఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవతంగా చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా కొత్తపల్లి గ్రామానికి రూ.21 కోట్లతో రోడ్లు కాలువలు పనులు, జల్లూరు, పొందూరు వంతెన నిర్మాణపనులు జరుగుతున్నాయన్నారు. అడ్డురోడ్డు నుంచి రహదారి నిర్మాణ జాప్యం పట్ల అధికారులను హెచ్చరించానని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నామని అన్నారు, మండలంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిమిత్తం 492 ఎకరాలను గుర్తించామని, త్వరలో వాటిని ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు, జనసేన మండల అధ్యక్షులు చిటికెల శ్రీనివాస్, రాయవరం పార్టీ అధ్యక్షులు అబద్ధం, వేచలపు జనార్ధన్, జానకి శ్రీను, తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈఓపిఆర్డి రఘురాం, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు

నియోజకవర్గంలో భారీ పరిశ్రమల ఏర్పాటు

పాయకరావుపేట : నియోజకవర్గంలో త్వరలోనే భారీ పరిశ్రమల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హోంమంత్రి అనిత అన్నారు. పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథిగృహంలో అధికారులతో సమీక్షలో మాట్లాడుతూ రూ.1.30లక్షల కోట్లతోస్టీల్‌ప్లాంట్, టాయ్ ఫ్యాక్టరీ త్వరలోనేఏర్పాటు అవుతుందన్నారు. సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల్లో హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు.

భూసమస్య పరిష్కారానికి వినతి

కోటవురట్ల : మండల కేంద్రంలోని సీతారామరాజు నగర్ కాలనీ ప్రాంతాన్ని ఎండోమెంట్ భూములుగా చూపడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని హోంమంత్రి వంగలపూడి అనితకు కాలనీవాసులు మహిళలు వినతిపత్రం అందజేశారు, 70 ఏళ్లకుపైగా తాతముత్తాతల నుంచి కాలనీలో నివాసముంటూ, క్రయ విక్రయాలు జరుపుకునే వాళ్ళమన్నారు. అయితే ఈ భూమిని దేవాదాయశాఖ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో చూపడం వల్ల ఆరేళ్లుగా క్రయ విక్రయాలు నిలిచిపోవడంతో కనీసం బ్యాంకు నుంచి రుణాలు కూడా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని మహిళలు వినతి పత్రం అందజేశారు, మండల పార్టీ అధ్యక్షులు లింగన్న నాయుడు జానకి శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షులు కసిరెడ్డి ఏసు పాల్గొన్నారు.

భూసేకరణపై రైతులను మభ్యపెట్టొద్దు

● హోంమంత్రి అనిత తీరును ఖండిస్తున్నాం: సిపిఎం



భూసేకరణ జిఒ పత్రాన్ని చూపిస్తున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పరిశ్రమల కోసం రెండవ విడత భూసేకరణపై హోం మంత్రి అనిత రైతులకు వాస్తవాలు చెప్పకుండా, మభ్యపెట్టే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్ అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పున్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు రెండు విడతలుగా భూములు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 26న జిఒ 76 విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం ఇప్పటికే 2,200 ఎకరాలు మొదటి విడతలో కేటాయించారని, రెండవ విడతలో 3,800 ఎకరాలకు కాగిత, వేంపాడు, నెల్లిపూడి, డి.ఎల్.పురం గ్రామాల్లో రైతుల నుండి భూములను సేకరించాల్సి ఉందన్నారు .అయితే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం నక్కపల్లిలో తన కార్యాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారన్నారు. అయితే భూసేకరణపై రైతులకు వాస్తవాలు తెలియ జేయకుండా, భూములు సర్వే మాత్రమే చేస్తారని, రైతులు సర్వేకు సహకరించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు వాస్తవాలు చెప్పకుండా మభ్య పెట్టడం సరికాదన్నారు.ఈ ఏడాది ఏప్రిల్ 3న ఆర్సెలార్ మిట్టల్, నిప్పున్ స్టీల్‌ప్లాంట్‌కు డి.ఎల్.పురంలో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటుకు అనుమతి ఇస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిలో భాగంగా డి.ఎల్.పురం నుండి తూర్పు, పడమర వైపు 2.9 కిలోమీటర్లు సముద్ర తీరాన్ని పోర్టుకు కేటాయించారని, భవిష్యత్తులో 2.9 కిలోమీటర్లు పరిధిలో మత్స్యకారులు చేపలు వేటకు వెళ్ళే పరిస్థితి ఉండదన్నారు.ఫలితంగా మత్స్యకారులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఈ ప్రాంతంలో మత్స్యకారుల మనుగడ కనుమరుగయ్యే పరిస్థితి ఎదురౌతుందన్నారు. ఎఇంతటి ప్రమాదకర, నష్ట దాయకమైన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం రైతులను దగా చేసి మిట్టల్ వంటి కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాలు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. హోం మంత్రి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రైతులు భూములు ఇచ్చేది లేదని ముక్తకంఠంతో తేల్చి చెప్పారని, రైతుల అభిప్రాయం, మనోభావాలను దష్టిలో పెట్టుకుని రెండవ విడత భూసేకరణ నిలుపు దల చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో నాయకులు వై.అప్పారావు, ఎం.రమణ పాల్గొన్నారు.